క్లుప్తంగా

'ఎంపీ, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి'

ఆదిలాబాద్‌టౌన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు కేటాయించకపోవడంపై ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీ ఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీల కారణంగా జిల్లాకు ఒరిగిందేమి లేదన్నారు. పార్టీ జెండాలు వేరైనా వారి ఎజెండా ఒకటేనని విమర్శించారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణం, విమానాశ్రయం కోసం నిధులు కేటాయిస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే సిగ్గుతో తలదించుకోవాలన్నారు. పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సమస్యలు పరిష్కరించాల్సింది పోయి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు.

చెట్ల కొమ్మల తొలగింపు

బోథ్: మండలంలోని పలు స్తంభాల విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలను విద్యుత్ అధికారులు బుధవారం తొలగించారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం కలగకుండా, విద్యుత్ షాక్‌కు గురి కాకుండా చెట్ల పొదలను తొలగించినట్లు వారు పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని తొలగించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ రమేశ్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ తహసీల్దార్ బదిలీ

నేరడిగొండ: తహసీల్దార్ సంతోష్ రెడ్డి బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ బూస మహేశ్ బుధవా రం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టా రు. నేరడిగొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సంతోష్ రెడ్డిని కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అలాగే అటెండర్ అశోక్ తలమడుగుకు, ధరణి ఆపరేటర్ ప్రభా కర్ గుడిహత్నూర్‌లకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, జూనియర్ అసిస్టెంట్ రవి, సర్వేయర్ శంకర్, యాటకర్ల పెద్దులు, సయ్యద్ షకీల్, రాజారాం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యుల బదిలీలు నిలిపివేయాలి

ఆదిలాబాద్‌రూరల్: రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (రిమ్స్) వైద్యుల బదిలీలను వెంటనే నిలిపి వేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రిమ్స్ వైద్య కళాశాలలో సరైన వైద్యులు లేక నిరుపేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యం అందించే కొంతమందిని బదిలీ చేయడం సరికాదన్నారు. అలాగే ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు ఆధ్వర్యంలో రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. వర్షకాలంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టేలా ముందస్తుగా రెయిన్‌కోట్లు పంపిణీ చేసినట్లు ఈవో సంజీవ్‌రావ్ తెలి పారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ గంగారాం, సిబ్బంది నారాయణ, శంకర్ లాల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్యంగా, సంస్థ గత నిర్మాణం భవిష్యత్ కార్యాచరణ కోసం గురువారం ఆదిలాబాద్ జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ మాదిగ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లా, మండల స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి శ్రీను, నరేశ్, వరుణ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

కైలాస్‌నగర్: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాదాలు జరగకుండా అనుసరించాల్సిన చర్యలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్, డీఎం కల్పన, తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తే రాకపోకలు బంద్

- కొట్టుకుపోతున్న వంతెనలు, అప్రోచ్‌రోడ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


వరద నీటికి కొట్టుకుపోయిన వంతెన అప్రోచ్ రోడ్డు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో వాగులపై వంతెనలు, కల్వర్టులున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు వంతెనలు, అప్రోచ్ రోడ్లు వరద దాటికి కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. అత్యవసర సమయంలో ప్రాణాలను అరి చేతిలో పెట్టుకొని కోతకు గురైన వంతెనలు, కల్వర్టులను దాటిన సందర్భాలు అనేకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు గురవుతున్న రోడ్లు..

మండలంలోని అంకోలి నుంచి చించుఘాట్ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో అంకోలి సమీపంలో గల మర్రి వాగు ప్రతీ ఏడాది ఉప్పొంగి వంతెనకు అనుకోని ఉన్న అప్రోచ్ రోడ్డు కోతకు గురవుతుంది. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరద నీటితో వంతెన అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో అటువైపు నుంచి వెళ్లే ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

తాత్కాలిక మరమ్మతులే..

చించుఘాట్ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో గల మర్రి వాగు వంతెనపై నుంచి సిరికొండ, న్యూ చించుఘాట్, చించుఘాట్, జెండాగూడ, పందిరిలొద్దీ, టిక్కిగూడ, కండెనగూడ, కేబీ కాలనీ, ధర్మగూడ, చిన్న మలేబోరిగాం, పెద్ద మలేబోరిగాం, గుండంలొద్దీ, రాములుగూడ, తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మర్రిగూడ వాగుపై అంకోలి సమీపంలో ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు 2018, 2022, 2023 సంవత్సరాలతో పాటు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయింది. ఆయా సందర్భాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం చూ పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రూ. 6 లక్షలతో మరమ్మతులు..

అంకోలి సమీపంలోని వంతెన వరద నీటికి కొట్టుకుపోయిన్నప్పుడల్లా దాని మరమ్మతు కోసం రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు వ్యయం చేస్తున్నారు. ఇప్పటి వరకు మూడుసార్లు చేసిన మరమ్మతుల కోసం సుమారు రూ. 6 లక్షలు కేటాయించారు. నాలుగోసారి వంతెన కొట్టుకుపోవడంతో ఇప్పుడు మరోసారి మరమ్మతులు చేపట్టాలంటే మళ్లీ రూ. 2 లక్షల వరకు వ్యయం కానుంది. పదే పదే నిధులు వెచ్చించే బదులు ఒకేసారి ఎక్కువ నిధులు వెచ్చించి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిసారి ఇదే పరిస్థితి



వర్షాకాలం వచ్చిందంటే చాలు తమ గ్రామ సమీపంలోని చించుఘాట్ గ్రామానికి వెళ్లే మార్గంలోని వంతెన వరద నీటికి కొట్టుకుపోతుంది. ఇప్పటికే నాలుగుసార్లు వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. – కనక రమణ, అంకోలి గ్రామస్తుడు

వంతెన దాటి పొలానికి వెళ్లాలి



తమ గ్రామానికి సమీపంలో మర్రి వాగుపై ఉన్న వంతెన దాటి వ్యవసాయ పొలానికి వెళ్లాల్సి ఉంటుంది. వంతెన దాటుతున్న సమయంలో ఒకసారి వరదనీరు రావడంతో వంతెన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. అప్రమతం కావడంతో తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. – పుదరి నవీన్, రైతు, అంకోలి

ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించండి


మాట్లాడుతున్న రాజేశ్వర్

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించాలని మాల జేఏసీ అధ్యక్షుడు శాంతపురం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ వినియోగంలో లేక పోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. మండల కేంద్రంలో తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రయాణికుల కోసం ఎలాంటి సౌకర్యాలు లేక పోవడంతో వర్షంలో, ఎండలో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకవచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్‌చౌక్‌లో ఆమె చిత్రపటానికి రక్తాభిషేకం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. దివ్యాంగులను కించపరిచేలా, హక్కులను ఉల్లంఘించేలా, మానవ హక్కులను భంగం కల్పించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ ఎందుకని మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, సయ్యద్ సాజిద్,, ముస్తఫా, ఖలీల్, యూనుస్, ఫెరోజ్ పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీ సహజమని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ అన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీ అయిన ఉద్యోగులను టీఎన్‌జీవో భవన్‌లో బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. బదిలీపై వెళ్లనున్న చంద్రశేఖర్, మురళీకృష్ణ, సీహెచ్ కవిత, సుజాత, హబీబ్, రవికాంత్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఫణిందర్, సబ్ రిజిస్ట్రార్లు అశోక్, విజయకాంత్, సాయినాథ్ పాల్గొన్నారు.

సీఎస్సీ నిర్వాహకుడికి రాష్ట్ర ఉత్తమ పురస్కారం


కొండ ప్రశాంత్‌కు పురస్కారం అందజేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం మోహన్‌దాస్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన సీఎస్సీ నిర్వాహకుడు కొండ ప్రశాంత్‌కు రాష్ట్ర ఉత్తమ పురస్కారం లభించింది. సీఎస్సీ నిర్వహణ 15 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బుధవారం కొండ ప్రశాంత్‌కు సీఎస్సీ ద్వారా ఉత్తమసేవలు అందించినందుకు ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో సీఎస్సీ రాష్ట్ర అధికారి సునీల్‌రెడ్డి, సీఎస్సీ ఎస్‌బీఐ రాష్ట్ర ఇన్‌చార్జి అనీమా, సీఎస్సీ ఆదిలాబాద్ జిల్లా మేనేజర్ రాహుల్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన సీఎస్సీ నిర్వాహకుడు జటాల శ్రీకాంత్ ఉత్తమ ప్రశాంస పత్రం అందుకున్నాడు. 2023– 24 గాను 16, 368 ట్రాన్సాక్షన్లు నిర్వహించినందుకు హైదరాబాద్‌లోని సీఎస్సీ అధికారుల చేతుల మీదుగా ప్రశాంస పత్రం బుధవారం అందుకున్నా రు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇచ్చోడ: ఎంఐఎం నాయకుడు మోసిన్‌ను వేధించి ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని మైనార్టీ యూత్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాటాడుతూ.. ప్లాట్ పంచాయతీలో ప్లాట్ విక్రయించిన వ్యక్తి కుటుంబసభ్యులు భౌతిక దాడి చేసి మనస్థాపానికి గురిచేశారని ఆరోపించారు. నలుగురు వ్యక్తులు చేసిన ఒత్తిడిని తట్టుకోలేక మోసిన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సమావేశంలో జాహెద్, ఫారుఖ్, సోఫియన్, సద్దాం, ముబిన్ ఉన్నారు.

ఎడతెరిపి లేని ముసురు


ఉధృతంగా ప్రవహిస్తున్న వడగామ్ వాగు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ముసురుకు మండలంలోని వడగామ్, పాటగూడ, మామిడిగూడ, జైత్రంతండా, చిత్తబట్ట గ్రామాల వాగులు పొంగిపొర్లాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు.

పాఠశాలల పరిశీలన

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌ను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ సందర్శించారు. మధ్యాహ్న భోజనం, పలు రికార్డులు, అమ్మ ఆదర్శ కమిటీ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డుల నిర్వహణ గురించి సీడీపీవో శారదను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికహారాన్ని పరిశీలించారు. ఎంఈవో ఆశన్న, సూపర్‌వైజర్లు వందన, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సంగీత తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోథ్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం కార్యదర్శి కరిపె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తమ డిమాండ్లను నెరవేర్చాలని ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యనారాయణ, ఆరేపల్లి రాజేశ్వర్, ఇప్ప శ్రీనివాస్, శంకర్, రమేశ్, మల్లేష్, చందు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి నైపుణ్యాన్ని పరిశీలించి, విద్యార్థులకు నా ణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుమ్మరి పో శెట్టి, ఈవో అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై లింబాజీ

ఇచ్చోడ: విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఏఎస్సై లింబాజీ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని నంబర్‌ల నుంచి ఫోన్ వస్తే వాటికి సమాధానం ఇవ్వవద్దన్నారు. బ్యాంకు వివరాలు, ఓటీపీ చెప్పవద్దన్నారు. బ్యాంకు అధికారులు ఎప్పుడు కూడా ఖాతాదారులకు ఫోన్ చేసి, వ్యక్తిగత సమాచారం అడగారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

తలమడుగు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఝరి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలోని నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈఎఫ్, ఈఎస్ఐ పెన్షన్, ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు రూ. 26,000 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ ఆశన్న, దర్శనాల మల్లేష్, ధోని పెళ్లి వెంకటమ్మ, అనసూయ, రాధా, విజయ, అరుణ్, వెంకట రమణ పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో మరోసారి అన్యాయం'


మాట్లాడుతున్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: కేంద్ర బడ్జెట్‌లో మరోసారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు రెండోసారి బీజేపీ ఎంపీని గెలిపించారని, తెలంగాణలో 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలకు గెలిపించిన కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా మొండి చేయి చూపించారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎంపీలు ఇప్పుడు తెలంగాణ ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, విమానశ్రయ నిర్మాణం, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్‌కు రైల్వేలైన్ మంజూరు వంటి వాటికి నిధలు కేటాయించలేదన్నారు. సమావేశంలో నాయకులు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులను నిరాశపర్చిన బడ్జెట్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను మరోసారి నిరాశపర్చిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబ్‌ను మార్చడంలో వేతన జీవుల డిమాండ్లను పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. పాత రిజీమ్ స్లాబ్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా కొత్త రిజీమ్ ఎంచుకున్న వారికి కేవలం రూ.3లక్షల లోపు మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చారని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం ద్వారా ప్రైవేటీకరణకు దారితీసే చర్యలు వేగవంతం చేస్తున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మొండి చేయి

ఎదులాపురం: జిల్లా నుంచి బీజేపీ అభ్యర్థిని రెండుసార్లు ఎంపీగా, శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను ఎమ్మెల్యేలను గెలిపించడం జరిగిందని, అలాంటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో అన్నారు. సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ, విమానశ్రయ నిర్మాణం, ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరుకి నిధులు కేటాయించలేదన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జోగు రామన్న

సాక్షి, నెట్‌వర్క్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు మనోహర్, రోకండ్ల రమేశ్, సాజిదొద్దిన్, వేణుగోపాల్, గోవర్ధన్, నారాయణ, కస్తాల ప్రేమల పాల్గొన్నారు. అలాగే ఉట్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి, బోథ్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

'వేతనం నిలిపివేయొద్దు'


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు జూలై 1 నుంచి గౌరవ వేతనం నిలిపివేయాలని ప్రభుత్వం ప్రకటించిందని, మాకు సమాచారం ఇవ్వకుండా వేతనం నిలిపివేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (టీఎన్‌జీవో అనుబంధ సంఘం) జిల్లా అధ్యక్షురాలు రాధ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జీవో విడుదల చేసేంత వరకు హాజరు పంపించాలని కోరారు. సీడీపీవోలు సహకరించాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు స్థానికతను బట్టి చేయాలని, ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి సునంద, తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న సభ్యులు

తాంసి: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించే షెడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చే శారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో చేపట్టే పనులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆశారెడ్డి, పరమేశ్, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, రామన్నయాదవ్, అశోక్, పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్‌లో జైనథ్ పీ హెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించా రు. మెడికల్ ఆఫీసర్ నైనత ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గర్భిణులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీహెచ్‌వో అంజయ్య, సూపర్‌వైజర్ లీల, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 53 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు సూచించారు. ఇంటి చుట్టూ పరిసరా ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్ఎం సుధారాణి, ఆశకార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.